# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-05-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తూ ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**
2. **ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందజేసే మందుల సరఫరా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకువస్తామని వెల్లడించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ .**
3. **రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి ఎంబార్కేషన్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**
4. **మచిలీపట్నాన్ని బంగారు పూత పనులుకు కేంద్రంగా మరింత అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్న గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర.**
5. **దేశ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్న బుద్ధ పూర్ణిమ వేడుకలు.**

==========================

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తూ ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కృష్ణాజిల్లా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కల గ్రామంలో నిర్వహించిన 'పేదల సేవలో' ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను లబ్దిదారులకు ఆయన ఈరోజు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

..వాయిస్.. 30 సెకన్లు..

అనంతరం అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మికులకు మే డే పురస్కారాలను ముఖ్యమంత్రి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ..

..వాయిస్.. 25 సెకన్లు

-------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఈరోజు కొనసాగుతోంది. ఎన్టీఆర్. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు, పార్వతీపురం మన్యం, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో

జరిగిన కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొని లబ్దిదారులకు నగదును అందజేశారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందజేసే మందుల సరఫరా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకువస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వైద్య శాఖ అధికారులతో మంత్రి నిన్న ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధాల కొనుగోలు నుంచి రోగులకు అందే వరకు ఉన్న ప్రస్తుత విధానాన్ని ప్రత్యేక వ్యవస్థద్వారా పునఃపరిశీలించనున్నట్లు చెప్పారు. అవసరంలేని మందులను జాబితా నుంచి తొలగించి, అవసరమైన కొత్త మందులను చేర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 71 కోట్ల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన మరో 380 రకాల మందులను త్వరలోనే ఆసుపత్రులకు సరఫరా చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

---------------------------

ప్రతి కార్మికుడు గౌరవంతో జీవించే సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ఈ రోజు శుభాకాంక్షలు తెలిపారు. అహర్నిశలు కష్టపడుతున్న శ్రామిక వర్గ హక్కులను గుర్తు చేసే చారిత్రాత్మక దినోత్సవం మేడే అని అన్నారు. దేశ ఆర్థిక పురోగతికి వ్యవసాయం వెన్నెముక అని, రైతులు, వ్యవసాయ శ్రామికుల శ్రమతోనే వ్యవసాయ రంగం ముందుకు సాగుతోందని తెలిపారు. కార్మిక, కర్షక సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు.

---------------------------

రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధికారులను ఆదేశించారు. హజ్ యాత్ర ఏర్పాట్లపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుంచి 21వ తేదీ వరకు దశలవారీగా హజ్ యాత్రికులు బయలుదేరనున్నారని చెప్పారు. హైదరాబాద్ నుంచి పన్నెండు వందల మందికి పైగా, బెంగళూరు నుంచి నాలుగు వందల మందికి పైగా యాత్రికులు ప్రయాణం చేయనున్నారని తెలిపారు. ఈ మేరకు యాత్రికులకు వసతి, భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

మచిలీపట్టణాన్ని బంగారు పూత పనులకు కేంద్రంగా మరింత అభివృద్ధి చేస్తున్నామని గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం సమీపంలోని పోతేపల్లి జువెలరీ పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మైక్రో గోల్డ్ ప్లేటింగ్ పరిశ్రమను ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావుతో కలిసి మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పోతేపల్లి జువెలరీ పార్క్‌లో అనేక నగల

తయారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, వీటి ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక పరిశ్రమల స్థాపనతో స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు వేగవంతమవుతాయని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ జువెలరీ పార్క్ ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారనుందని తెలిపారు.

--------------------------

పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా తగిన చర్యలు చేపడుతున్నామని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో ఆయన ఈరోజు మాట్లాడుతూ, గూడూరులో నిన్న ఈ వేసవికాలంలోనే అత్యధికంగా 45.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో గూడూరులోని ముఖ్య కూడళ్ల వద్ద వేడి నుంచి రక్షణ కోసం ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీరు అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

--------------------------

బుద్ధ పూర్ణిమ పర్వదినాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు. వైశాఖ మాసంలో వచ్చే పౌర్ణమిని బుద్ధ పూర్ణిమ లేదా వైశాఖ పూర్ణిమ అని పిలుస్తారు. వైశాఖ పూర్ణిమ రోజునే గౌతమ బుద్ధుని జననం జరిగిందని, అందుకే ఈ పర్వ దినాన్ని బుద్ధ పూర్ణిమగా బౌద్ధులు ఘనంగా వేడుకలు జరుపుకుంటారని చరిత్ర చెబుతోంది. బుద్ధ పూర్ణిమ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. బుద్ధుడు సూచించిన అహింస, ప్రేమ, కరుణ, శాంతి వంటి మార్గాలు మానవాళికి నేటికీ అనుసరణీయమని పేర్కొన్నారు.

--------------------------

నిరక్షరాస్యత నిర్మూలనకు పార్వతీపురంమన్యం జిల్లాలో చేపట్టిన 'ఉల్లాస్--అక్షర ఆంధ్ర' కార్యక్రమం విశేష ఫలితాలు సాధించిందని జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. పార్వతీపురంలో ఈ రోజు నిర్వహించిన సమావేశంలో అక్షర ఆంధ్ర కార్యక్రమ పురోగతిని వివరించారు. గతంలో జిల్లా అక్షరాస్యత శాతం 50.38 శాతం మాత్రమే ఉండేదని గుర్తుచేశారు. జిల్లాలో 2 లక్షలకు పైగా నిరక్షరాస్యులను గుర్తించగా, లక్ష్యానికి మించి 67 వేల మందికి పైగా 'అక్షర ఆంధ్ర' యాప్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ద్వారా 2026 నాటికి అక్షరాస్యతను 83.87 శాతానికి పెంచగలిగామని, కేవలం ఏడాది కాలంలోనే 8 శాతానికి పైగా వృద్ధి సాధించామని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

--------------------------

రాజధాని అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులను హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా తుళ్లూరు సమీపంలో 750 కోట్ల రూపాయలతో 21 ఎకరాలలో నిర్మాణాన్ని చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకొని మొదటి దశలో 5 వందల పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రారంభించినట్లు చెప్పారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక వైద్యపరికరాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

====================